## బ్రాహ్మణపల్లిలో క్షుద్రపూజల కలకలం

నర్సాపూర్, మే11 : మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో ఆదివారం క్షుద్రపూజలు కలకలం సృష్టించాయి. గ్రామానికి చెందిన కమ్మరి నర్సింహులు ఇంటి వాకిట్లో కొందరు దుండగులు క్షుద్రపూజలు చేశారని కుటుంబసభ్యులు వెల్లడించారు. ఆదివారం ఉదయం నిద్ర లేచి చూడగానే ఇంటి బయట వాకిట్లో మనిషిని పోలిన బొమ్మ, నిమ్మకాయలు, మిరపకాయలు, పసుపు, కుంకుమలను గుర్తుతెలియని దుండగులు ఒకచోట పెట్టి వెళ్లారు. పిండితో మనిషిని పోలిన బొమ్మను తయారు చేసి దానికి మేకులు గుచ్చి, అలాగే పిండితో బొక్కలను పోలిన రూపాన్ని తయారు చేసి వాకిట్లో పెట్టి భయంకరమైన వాతావరణాన్ని సృష్టించారు. కుటుంబ సభ్యులు వీటిని చూడగానే భయభ్రాంతులకు, ఆందోళనకు గురయ్యారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కుటుంబ సభ్యులు కోరారు.

## వడదెబ్బ తగిలి వ్యక్తి మృతి



దుర్గం బాలయ్య మృతదేహం

తూప్రాన్, మే 11: వడదెబ్బ తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన తూప్రాన్‌లో ఆదివారం జరిగింది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట మండలం పోతన్‌పల్లికి చెందిన దుర్గం బాలయ్య (49) కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. రోజు లాగే కూలి పనులకు వచ్చి తిరిగి ఇంటికి రాలేదు. ఈ క్రమంలో శనివారం రాత్రి వడ్డదెబ్బ తగిలి తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం ఎదురుగా లేబర్ అడ్డా వద్ద పడిపోయి ఉన్నాడు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు తొలుత గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా గుర్తించి, విచారణ చేపట్టారు. సామాజిక మాధ్యమాల ద్వారా మృతుడిని గుర్తించిన స్థానికులు ఆదివారం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వాటర్ హీటర్ షాక్ తో మహిళ మృతి

పాపన్నపేట, మే 11: వాటర్ హీటర్ షాక్‌తో ఓ మహిళ మృతి చెందిన ఘటన పాపన్నపేటలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెస్త భాగ్య, భూపతి దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు. సోమవారం ఉదయం భర్త చేపలు పట్టేందుకు నదికి వెళ్లాడు. సెలవులు ఉండడంతో పిల్లలు, అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న భాగ్య (36) స్నానం చేసేందుకు, బకెట్‌లో వాటర్ హీటర్ పెట్టింది. మరిచిపోయి నీళ్ల వేడి అయ్యాయా అని చూడటానికి, బకెట్‌లో చెయ్యి పెట్టింది. నీళ్లకు విద్యుత్ ప్రసారం కావడంతో, షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన భర్త, నీటి బకెట్ వద్ద మృతిచెందిన భార్యను గమనించి కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ విషయమై పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్‌ను వివరణ కోరగా, ఫిర్యాదు అందాల్సి ఉందని తెలిపారు.

## రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి

పాపన్నపేట, మే 11: మండలంలోని కుర్తివాడ వద్ద రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కుర్తివాడకు చెందిన కర్రోళ్ల శేఖర్ (62) రోజూ హనుమాన్ ఆలయం వద్ద శుభ్రం చేస్తుంటాడు. ఆదివారం టీవీఎస్ మోపెడ్‌పై కుర్తివాడ నుంచి పాపన్నపేట వైపు వెళ్తుండగా మిన్పూర్ నుంచి మెదక్ వైపు వెళ్తున్న గ్లామర్ బైక్ ఢీకొట్టింది. దీంతో కర్రెల శేఖర్, కిష్టయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని మెదక్ ఏరియా దవాఖానాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కర్రెల శేఖర్ మృతి చెందాడు. తీవ్ర గాయాలైన కిష్టయ్యను మెదక్ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమార్తె ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

## గొర్రెలపై కుక్కల దాడి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

చిలిపిచెడ్, మే 11: కుక్కలు దాడి చేయడంతో 8 గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలోని బద్రియ తండాలోని ఆదివారం జరిగింది. గొర్రెలను మేపుకొని వచ్చాక, గొర్రెల పాకలో ఉంచుతామని, 8 గొర్రెలు మృతి చెంది ఉన్నాయని యజమాని కడావత్ లక్ష్మణ్ నాయక్ తెలిపారు. వీధి కుక్కలు గొర్రెలపై దాడి చేసి 8 గొర్రెలను చంపేశాయన్నారు.

# దేశ సైనికులు సురక్షితంగా ఉండాలి

- ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి
- కూలీలతో కలిసి టంకర తీసిన ఎమ్మెల్యే
- మామిడి టంకర దందా వివరాలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే





కొడిపల్లి: రాయిలాపూర్ ఎల్లమ్మ, మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



కొల్చారంలో వధూవరులను ఆశీర్వదిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



కొడిపల్లి: లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

కొల్చారం, మే 11: రేణుకా ఎల్లమ్మ ఆశీర్వాదంతో దేశ సైనికులు సురక్షితంగా ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కోరారు. కొల్చారంలో రెండు రోజులుగా గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మతల్లి జాతరకు ఆదివారం ఎమ్మెల్యే హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేతో పాటు ఆమె వెంట ఉన్న నాయకులను సత్కరించారు. ఒగ్గు కళాకారులు ఎల్లమ్మ చరిత్రను గానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్లమ్మతల్లి ఆశీర్వాదంతో దేశం సుభిక్షంగా ఉండాలన్నారు. పహల్గావ్ దాడి నేపథ్యంలో దేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరారు.

### వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

అప్పాజిపల్లికి చెందిన పాత్రికేయుడు గోపాల్ కుమార్తె వివాహ వేడుకలు కొల్చారంలోని బాబా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

### ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలి

కౌడిపల్లి, మే 11: గ్రామ దేవతల దయతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని రాయిలాపూర్‌లో శ్రీఎల్లమ్మ, మల్లన్న జాతరకు హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. దేవులతండా తనికి (హరిచంద్‌తండా)లో ప్రతిష్ఠించిన జగదాంబదేవి ఆలయంలో పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట యువత విభాగం అధ్యక్షుడు సంతోష్ రావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, నాయకులు సంతోష్ కుమార్, కొల్చారం మాజీ సర్పంచ్ ఉమారాజాగౌడ్, గ్యాస్ కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ నాగూర్ మనోహర్, పాండ్ర వెంకటేశం, జూలకంటి సంఘమేశ్వర్, చిన్నరాములు, భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు రామకృష్ణాగౌడ్, అశోక్ గౌడ్, కృష్ణ గౌడ్, కిరణ్, దుర్గాప్రసాద్, రాములు, లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ ఎల్లం, మాజీ ఎంపీటీసీ కిశోర్ గౌడ్, సాయగౌడ్, నాయకులు అమర్‌సింగ్, లక్యనాయక్, మొగులాగౌడ్, శేఖర్, శ్రీనివాస్‌గౌడ్, ప్రతాప్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## అన్ సీజన్‌లోనూ ఉపాధి



టంకర కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



మామిడి కాయ టంకర తీస్తున్న ఎమ్మెల్యే

కొల్చారం, మే 11: కొల్చారం గ్రామాన్ని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆదివారం సందర్శించారు. రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎదురుగా ఉన్న మర్రిచెట్టు కింద మామిడి టంకర తీస్తున్న కూలీలను చూసి వారి వద్దకు వెళ్లారు. వారితో మాట్లాడుతూ కూలీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కూలీలతో కలిసి స్వయంగా మామిడికాయ తొక్క తీసారు. ఎమ్మెల్యే టంకర పని వివరాలు అడిగి తెలుసుకున్నారు. 100 కాయల టంకర తీస్తే రూ.40 చెల్లిస్తారని కూలీలు తెలిపారు. ఒక్క రోజు సుమారు 600 నుంచి వెయ్యి కాయల వరకు టంకర తీస్తామన్నారు. మామిడి కాయల తొక్కతీసి, టంకర కోసి ఇవ్వడంతో కూలీ పూర్తవుతుందన్నారు. తర్వాత టెంకలు యజమానికే అప్పగించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే పలువురు వర్తకులతో మాట్లాడారు. కాలం కనికరిస్తే లాభం వస్తుందని, లేకుంటే నష్టం చూడాల్సి వస్తుందని వారు తెలిపారు. సరుకు నాణ్యత బట్టి అయిదారు గ్రేడ్లుగా చేసి ధర నిర్ణయిస్తారు. ప్రస్తుతం 14 వేల నుంచి 28 వేల వరకు ధరలున్నాయి. ఈ పని సుమారు 40 నుండి 50 రోజుల వరకు ఉంటుంది.

### సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే అన్నారు. తిమ్మాపూర్‌కు చెందిన వెంకన్నగారి కొండల్‌రావుకు మంజూరైన రూ.10.500 చెక్కును అందజేశారు. ధర్మాసాగర్‌కు చెందిన బీఆర్ఎస్ సోషల్‌మీడియా కోఆర్డినేటర్ జీవన్ గౌడ్ ప్రమాదానికి గురయ్యాడు. అతడి ఇంటికి వెళ్లి పరామర్శించి, ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు.

### రోజుకు వెయ్యి కాయలు కొడ్తాం



యేటా టంకర కూలి పని చేస్త. ఒక్కలం రోజుకు 8వందల నుంచి వెయ్యి కాయల టంకర తీస్తం. రోజుకు నాలుగు వందల రూపాల దాకా వస్తయి. చెట్టు నీడకు సల్లగ పని చేసుకుంటం. పని అయిపోంగానె పయిసల్దీసుకుంటం. అందాజ 40 యాభై మందిమి ఈ పని చేస్తం. ఇయ్యాల ఎమ్మెల్యే అచ్చి పనిచేసుడు మంచిగనిపించింది.

**- వడ్డే కిష్టమ్మ, టంకర కూలి, కొల్చారం**

### సీజన్లనే ఈ దందా జేస్తం



సీజన్ సీజన్ల దందా జేస్తం. ఈ దందకు కొల్చారం పేరెల్లింది. ఊర్ల మొత్తం యాపారం చేసేటోళ్లు ఏడెనిమిది మంది ఉంటారు. ఓపికునోళ్లకు పైస. చాలా కష్టం ఉంటది. వర్షం, గాలి దుమారానికి పచ్చ కాపాడుకోవాలె. అట్లయితేనే ఏక్ నంబర్ మాల్ దిగుతది. అట్లయితెనే రేటు తల్గుతది. అన్ని మంచిగుంటే సీజన్ల లక్ష నుంచి రెండు లక్షలదాకా కామాయించొచ్చు.

**- దొంకెన మల్లేశం, టంకర వర్తకుడు, కొల్చారం**

# సాగుకు భరోసా ఏదీ ?

- 1,49,491 ఎకరాలకు రైతు భరోసా బాకీ!
- నాలుగు నెలలైనా పూర్తికాని భరోసా పథకం ప్రక్రియ
- ఇప్పటి వరకు 2,36,866 ఎకరాలకే పెట్టుబడి సాయం
- పెండింగ్‌లో రూ.89.69 కోట్లు





మెదక్, మే 11 (నమస్తే తెలంగాణ): నాడు రైతుబంధు అన్నదాతలకు పండుగైతే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు పెట్టుబడి సాయం కింద ఇస్తున్న రైతు భరోసా పథకం వారి పాలిట శాపంగా మారింది. రైతు భరోసా నగదు సగం మంది రైతుల ఖాతాల్లోనే జమ అయ్యింది. మిగతా రైతులకు రాకపోవడంతో రాష్ట్ర సర్కార్‌పై దుమ్మెతిపోస్తున్నారు. గతేడాది నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందిస్తూనే ఉంది. కొంతమంది రైతులకు రైతు భరోసా అంది మూడు నెల లు కావస్తున్నా, మిగతా వారికి పెండింగ్‌లోనే ఉన్నాయి. యా సంగి పూర్తయి వానకాలం పంట సాగుకు సిద్ధంగా ఉన్నా రైతులకు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూడక తప్పడంలేదు.

### 1.49 లక్షల ఎకరాలకు రైతు భరోసా రాలే..

జనవరి 26న రైతు భరోసా పథకాన్ని ప్రారంభించింది ప్రభుత్వం. మండలానికి ఓ గ్రామం చొప్పున పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన 21 గ్రామాల రైతుల ఖతాల్లో నగదు జమ చేసింది. ఆ తర్వాత వారం ఒక ఎకరం, నెల రోజుల తర్వాత ఒక్కో ఎకరా పెంచుతూ ఇప్పటివరకు నాలుగు ఎకరాల్లోపు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో పంట పెట్టుబడి సాయం రైతు భరోసా డబ్బులు జమ చేశారు. జిల్లాలోని సాగు భూముల్లో ఇప్పటివరకు 70 శాతం మాత్రమే రైతు భరోసా డబ్బులు జమ అయ్యాయి. మరో 30 శాతం భూమికి డబ్బులు రావాల్సి ఉంది.

### పెండింగ్‌లో రూ.89.69 కోట్లు

మెదక్ జిల్లాలో 3,86,357 ఎకరాల్లో వ్యవసాయ భూమి ఉంది. 2,91,399 మంది రైతులు ఉన్నారు. వీరికి రైతు భరోసా కింద రూ.231,81,47,557 చెల్లించాల్సి ఉంది. 2,36,866 ఎకరాల్లో 2,26,970 మంది రైతులకు రూ.142,12,00,316 రైతుల ఖాతాల్లో జమ చేశారు. మరో 1,49,491 ఎకరాలకు 64,428 మంది రైతులకు రూ.89,69,47,241 రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. వ్యవసాయ శాఖ అధికారులు పెండింగ్‌లో ఉన్న బిల్లులు రెడీ చేసి ట్రెజరీకి పంపించారు. బిల్లులు చేసి ట్రెజరీకి పంపిన మరో రూ.89.69 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

### వానకాలం సీజన్ ప్రారంభం

యాసంగి సీజన్ ముగిసింది. ఇక వానకాలం సీజన్ ప్రారంభం కానున్నది. రైతుకు పెట్టుబడి సాయం అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధు పేరిట ఈ పథకాన్ని ప్రారంభించింది. ప్రస్తుత సర్కార్ రైతు భరోసాగా పేరు మార్చి అమలు చేస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యాసంగి, వానకాలం రెండు పంటలకు పెట్టుబడి సాయం కింద రైతు బంధు పథకం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యేవి. దీంతో రైతులు విత్తనాలు, ఎరువులు, ట్రాక్టర్ దున్నకానికి సాయం అయ్యేవి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డిసెంబర్‌లో ఇవ్వాల్సిన రైతు భరోసా డబ్బులు రైతులకు ఇవ్వకుండా మొండి చేయిచూపింది. పథకం ప్రారంభించిన తర్వాత కూడా ఒక్కో ఎకరం చొప్పున డబ్బులు ఖాతాల్లో జమ చేస్తూ వస్తున్నది. ఎకరం దాటి మరో ఎకరానికి డబ్బులు జమ చేసేందుకు మొదట్లో వారం రోజుల సమయం పట్టగా, ఇప్పుడు నెల రోజులు పడుతోంది. పథకం ప్రారంభమై మూడు నెలలు గడిచినా నాలుగు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు మాత్రమే సాగు సాయం అందింది. పది ఎకరాలు ఆ పైన సాగు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా డబ్బులు అందటానికి మరో రెండు మూడు నెలలు పడుతుందా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇంతకీ తమలాంటి వారికి రైతు భరోసా డబ్బులు వస్తాయా అనే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.

### రూ.89.69 కోట్లకు బిల్లులు పంపించాం



మెదక్ జిల్లాలో ఇప్పటికే 2,36,866 ఎకరాలకు పైగా రైతుల ఖాతాల్లో రూ.142,12,00,316 రైతు భరోసా డబ్బులు జమ అయ్యాయి. మరో 1,49,491 ఎకరాలకుగాను 64,428 మంది రైతులకు రూ.89,69,47,241 రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. వీటి బిల్లు ట్రెజరీకి పంపించాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

**- వినయ్‌కుమార్, డీఏవో మెదక్ జిల్లా**

## ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: ఎస్పీ



ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నిజాంపేట, మే 11: ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండాలని, అందుకు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చల్మెడలో శ్రీకర దవాఖాన సహకారంతో నిజాంపేట, రామాయంపేట మండలాల్లోని పీఎంపీ, ఆర్ఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, రాచకొండ అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు గ్రామీణ స్థాయి వారికి ఎంతోగానో దోహదపడుతాయన్నారు. వైద్య పరీక్షలు చేయడంతో వ్యాధి ప్రాథమిక దశలోనే గుర్తించడం వీలవుతుందన్నారు. అనంతరం శ్రీకర దవాఖాన సిబ్బంది ఎస్పీకి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాల్‌రెడ్డి, తిరుమల ఆలయ కమిటీ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు ముత్యంరెడ్డి, రమేశ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం తూకంలో మోసం



బచ్చురాజ్‌పల్లిలో తూకంలో మోసం జరిగిందంటూ ఆరోపిస్తున్న రైతులు

- బస్తాకు 1.5 కిలోల వరకు దోపిడీ
- అధికారుల పర్యవేక్షణ కరువైందంటున్న రైతులు

నిజాంపేట, మే 11: మండలంలోని బచ్చురాజ్‌పల్లిలో ఐకేపీకి చెందిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకం వేసే విషయంలో మోసం జరుగుతున్నదని స్థానిక రైతులు ఆరోపించారు. ఆదివారం రైతులు కొనుగోలు కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు దుర్గోల్ల లింగం మాట్లాడుతూ 30 బస్తాల్లోని ధాన్యం తూకం వేస్తున్న క్రమంలో అనుమానం వచ్చిందని, ధాన్యాన్ని మళ్లా తూకం వేయాలని కోరానని తెలిపాడు. అప్పుడు ఒక్కో బస్తాలో 1.5 కిలోల వరకు ధాన్యం వ్యత్యాసం వచ్చిందన్నారు. ఇలా ఎంతమంది రైతులను మోసం చేస్తారంటూ నిర్వాహకులను ప్రశ్నించానన్నారు. కొనుగోలు కేంద్రం నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కరువైందని, తూకం విషయంలో దోపిడీకి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు నరేందర్‌నాయక్, రాజు, పోచయ్య తదితరులు ప్రభుత్వాన్ని కోరారు.

## ఏడుపాయల్లో భక్తుల సందడి



క్యూ లైన్‌లో భక్తులు



పూజలందుకుంటున్న అమ్మవారు

పాపన్నపేట, మే 11: ఏడుపాయల వనదుర్గా భవానీ మాత సన్నిధిలో ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో సందడి నెలకొన్నది. వేసవి సెలవులు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. మంజీరా నదిలోని వివిధ పాయల్లో పుణ్యస్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు, మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో చంద్రశేఖర్ సిబ్బంది శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, శ్యాం, బత్తిని రాజు, నర్సింహులు, వరుణాచారి, నరేశ్, మహేశ్ తదితరులు ఏర్పాటు చేశారు. వేదపండితులు శంకరశర్మ, పార్థీవ శర్మ, రాము శర్మ, నాగరాజు శర్మ తదితరులు పూజలు చేశారు. ఏడుపాయల్లో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తమ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు చర్యలు చేపట్టారు.

## 52 ఏండ్ల తర్వాత అపూర్వ సమ్మేళనం



రామాయంపేట, మే 11: పట్టణంలోని శారద బంకెట్ హాల్‌లో 1973–74 బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. దాదాపు 52 ఏండ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు మళ్లీ కలిసి ఆనందాన్ని పంచుకున్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నిజాంపేట, మే 11: నిజాంపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 1999–2000లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 25 ఏండ్ల తర్వాత ఒకే చోట తమ ఉపాధ్యాయులతో అందరూ కలుసుకోవడం ఆనందంగా ఉందంటూ తమ జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకున్నారు.

## హ్యూమన్‌రైట్స్ మండల అధ్యక్షుడిగా రాజేశ్వర్‌గౌడ్



నర్సాపూర్, మే 11: నేషనల్ హ్యూమన్‌రైట్స్ కమిటీ మండల అధ్యక్షుడిగా గొల్లపల్లికి చెందిన ఉసిరికపల్లి రాజేశ్వర్ గౌడ్ నియమితులయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నేషనల్ హ్యూమన్‌రైట్స్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మొగుల్ల భద్రయ్య నియామక పత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షుడు సాయిప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

చేగుంట, మే11: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన చేగుంట పోలీసు స్టేషన్ పరిధిలోని మక్కరాజిపేట రోడ్డులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేట మండలం దంతెపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్(25) కర్నాల్‌పల్లిలోని ఎల్లమ్మ ఆలయానికి దైవ దర్శనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాడు. సాయంత్రం కొన్ని వస్తువుల తీసుకుని రావడానికి చేగుంటకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గెస్‌హౌస్ సమీపంలోని కర్నాల్‌పల్లి చేగుంట రహదారిపై బైకు అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాలై ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చేగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చేగుంట,మే11: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సంపల్లి ఆటవీ ప్రాంతంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. నర్సంపల్లి గ్రామానికి చెందిన కొందరు తునికి ఆకు తెంపడానికి ఆటవీ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ఓ కుళ్లిపోయిని మగ వ్యక్తి మృతదేహం కనిపించింది. దీంతో స్థానికుల సహాయంతో నార్సింగి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుళ్లిపోయిన మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు మతిస్థిమితం లేకుండా ఉన్న వ్యక్తియై, నెల రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి ఒంటి మీద లుంగి, తెల్ల వెంట్రుకలు, నల్లని మొలతాడు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుడికి సంబంధించిన ఆచూకీ తెలిస్తే నార్సింగి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

## ఎప్‌సెట్ ఫలితాల్లో 'గీతా' జయకేతనం



షేక్ అక్రం (4887)



ఆశీర్వాదం (5164)



సాయి నిహాంత్ (5347)

తూప్రాన్, మే 11: ఆదివారం విడుదలైన ఎప్‌సెట్ ఫలితాల్లో తూప్రాన్ 'గీతా' విద్యార్థులు విజయ బావుటా ఎగురవేశారు. ఇంజినీరింగ్ విభాగంలో షేక్ అక్రం (4887) ర్యాంక్, కేతావత్ ఆశీర్వాదం (5164), ఎ.సాయి నిహాంత్ (5347) ర్యాంకులతో సత్తా చాటారు. ఈ సందర్భంగా గీత కళాశాల కరస్పాండెంట్ పి.రామాంజనేయులు, చైర్‌పర్సన్ పి.ఉష, డైరెక్టర్లు బి.రాఘవేందర్ గౌడ్, కె. నారాయణ గుప్తా, ఎంవీ.కృష్ణ, కేవీ ప్రసాద్, ప్రిన్సిపాల్ టి.రాజు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

## నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆర్గనైజేషన్ కార్యదర్శిగా రాంసింగ్



నియామక పత్రాలతో కమిటీ సభ్యులు

చేగుంట, మే11: నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆర్గనైజేషన్ కార్యదర్శిగా చేగుంటకు చెందిన రాజ్ పురోహిత్ రాంసింగ్ నియామకమయ్యారు. మానవ హక్కుల రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య అధ్యక్షతన జిల్లా అధ్యక్షుడు సాయియాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం చేగుంటలో జరిగిన కార్యక్రమంలో జిల్లా, మండల కమిటీని ఎన్నుకున్నారు. మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వడియారానికి చెందిన మహమ్మద్ నదీమ్, కార్యవర్గ సభ్యులుగా కర్నాల్‌పల్లికి చెందిన చింతాకుల లింగం, చేగుంటకు చెందిన కన్నరామ్, చేగుంట మండల శాఖ అధ్యక్షుడిగా పి ఈశ్వర్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆర్గనైజేషన్ కార్యదర్శిగా రాజ్ పురోహిత్ రాంసింగ్ నియామకమైనట్లు వారు తెలిపారు.